# ఆటోమాటిజం

ప్రియ మిత్రులారా,

బాబూజీ మహారాజ్ తన సందేశాల ద్వారా మన సాధనలో ఆటోమాటిజం శాశ్వతంగా రావాలన్న స్ఫూర్తినిస్తూ ఉన్నారు. మౌలికంగా ఆయన చెబుతున్నదేమిటంటే మన సాధన ప్రతి నిత్యం నిర్ధారిత సమయంలో జరిగేలా చూసుకోమంటున్నారు. ప్రతీ పనీ ఏ సమయానికి చెయ్యవలసిన పనిని ఆ సమయానికి చేయడం వల్ల ఆరోగ్యానికీ మంచిది, వివిధ సమయాల్లో తీసుకొనే ఆహారానికి మంచిది, నిద్రకూ కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఏ పనైనా కూడా ప్రతి రోజూ నిర్ధారిత సమయంలో చేసుకోవడం వల్ల, ఆ పని ఆ సమయంలో తనంతతానుగా సహజంగా జరిగిపోతూ ఉంటుంది. ఆ విధంగా మన శరీర వ్యవస్థలో జీవగడియారం ఏర్పడిపోతుంది. ఇది ప్రకృతిలో సహజంగా ఉండేటువంటి వాస్తవం.

## మొదటి మెట్టు

ఒక పనిని ప్రతి నిత్యం చేయడం అలవాటైనప్పుడు, మన శరీర వ్యవస్థలో అది స్వభావంగా మారిపోతుంది. మనసు సహజంగా సంసిద్ధంగా ఉంటుంది. అలాగే ప్రతినిత్యం సమయానికి ధ్యానం చేసుకున్నట్లయితే, ధ్యానంలో అంత కష్టపడవలసిన అవసరం ఉండదు. ప్రతీ ఉదయం ఒకే సమయాన ధ్యానం చేసుకోవడం అలవాటైపోతే, ధ్యానంలోకి అప్రయత్నంగానే జారుకోవడం జరుగుతుంది; అంత సంఘర్షణ చెయ్యవలసిన అవసరం ఉండదు. బాబూజీ ఇచ్చిన మొదటి సూక్తి ప్రకారం, తెల్లవారక ముందే గనుక ధ్యానం పూర్తి చేసుకోగలిగితే, ఈ ప్రక్రియను నిర్వర్తించడం ఇంకా సహజమైపోతుంది.

నిజానికి, ప్రతినిత్యం ప్రతీదీ సమయానికి చేసుకొనే పద్ధతి అనేది ఆటోమాటిజంలో కేవలం మొదటి మెట్టుమాత్రమే; బాబూజీమహారాజ్ చెప్పే ఆటోమాటిజం జోలికి ఇంకా మనంరానే లేదు. అయినా మనలో చాలా మందికి ఈ మొట్టమొదటి అడుగు వెయ్యడానికే చాలా వివరణలు ఇవ్వవలసి వస్తూంటుంది. ఎందుకంటే 'ఆటోమాటిజం' అనే పదాన్ని సాధారణంగా అపార్థం చేసుకుంటూ ఉంటారు. అన్నీ ఆటోమాటిక్ గా జరిగిపోవడం అంటే మనం మరబొమ్మలమైపోతామని, రోబోలమైపోతామని, యాంత్రికంగా జీవం లేకుండా పనులు చేస్తామనీ కాదు. స్వేచ్ఛకు అడ్డుపడకపోగా, నిజానికి మనకి మరింత మరింత స్వేచ్ఛ కలిగే విధంగా సంసిద్ధులను చేస్తుంది ఆటోమాటిజం. చుట్టూ ఉన్న ప్రకృతి పనితీరును గనుక గమనించినట్లయితే, అక్కడ కదలికలన్నీ కూడా అప్రయత్నంగానే జరుగుతున్నాయని అర్థమవుతుంది. ఒక మబ్బు తనలోని నీరును ఉంచుకోవాలని గాని విడిచిపెట్టేయాలి అని గాని అనుకోదు. ప్రకృతికి ఎంపిక చేసుకొనేటువంటి అవకాశమూ ఏ విధంగానూ ఉండదు. అన్నీ సహజమైన రీతిలో అలా కొనసాగిపోతూ ఉంటాయి.

సరిగ్గా అదే మనం చేసే పనులకు కూడా వర్తిస్తుంది. దీనికి కొట్టొచ్చే ఉదాహరణ, వ్యోమగామిడి శిక్షణ. అతను అంతరిక్షంలో స్వేచ్ఛగా కొనసాగాలంటే ఇక్కడ అటువంటి ఆటోమాటిజం తన అలవాట్లలో రావాలి. అది జరగాలంటే తెగ కష్టపడాలి. మనలో చాలా మందికి కారు నడపడంలో ఆటోమాటిజం అవసరం ఎలాగో అర్థం చేసుకోగలుగుతారు. ప్రాక్టీసు లేకుండా అనేక రకాలైన పనులు – స్టీరింగు, బ్రేకు-ఆక్సిలరేటర్ పెడళ్ళు తొక్కడం, గేరు మారుస్తునప్పుడు క్లచ్ ను వాడటం, ముందు చూడటం, సైడ్ మిర్రర్ల ద్వారా ప్రక్కలు చూసుకోవడం, రేర్-మిర్రర్ ను చూసుకోవడం, ఇండికేటర్ వాడటం, కారును నావిగేట్ చేయగలగడం, ఇక మధ్యలో సంభాషించడం, సంగీతం వినడం – ఇన్ని రకాల పనులు చేయాలంటే చాలా కష్టం. స్వేచ్ఛగా కారు నడపాలి అంటే మనం ఆటోమాటిజంపై (అప్రయత్నంగా నడిచే పరిస్థితిపై) ఆధార పడవలసిందే.

## అప్రయత్న పరిస్థితిని సాధించాలంటే చాలా ప్రయత్నం కావాలి

మనం ఈ 'మనసు-లేని' స్థితిని మరింత పరిపూర్ణ స్థాయికి కూడా తీసుకువెళ్ళవచ్చు; దీన్ని పతంజలి మహర్షి తన యోగసూత్రాల్లో మొదట్లోనే యోగం యొక్క నిర్వచనం చెబుతూ చాలా అందంగా చెప్పడం జరిగింది:

**1.2 योग: चित्त-वृत्ति निरोध:**

యోగశ్చిత్త వృత్తినిరోధ:

యోగం అంటే మనసు యొక్క ఎంపిక చేసుకొనేటువంటి కదలిక యొక్క వేగం తగ్గిపోయి, చింతన పూర్తిగా ఆగిపోయే పరిస్థితికి రావడం..

అత్యున్నత పరిపూర్ణ స్థితికి చేరుకోటానికి, ప్రయత్నపూర్వకంగా సరిదిద్దుకోవలసినదేదీ ఉండదు. మానసికంగా సరిదిద్దవలసిన అవసరం ఎంత వస్తే అంతా అపరిపూర్ణంగా ఉంటుంది, మనం చేసే

పని. వేణుగానం చేసే మహావిద్వాంసుడిని నిద్రలేపి వాయించమన్నా అంతే నైపుణ్యంతో వేణుగానం చేయగలుగుతాడు. అతను సగమే మెలకువగా ఉన్నా, బుద్ధి సరిగ్గా పని చేసే స్థితిలో లేకపోయినా, అతని చేతుల్లో గనుక వేణువును పెట్టినప్పుడుఅప్రయత్నంగానే అతని వేళ్ళు కదులుతాయి, ఆతని శ్వాస ఆడటం కూడా తగిన విధంగానే ఉంటుంది. వాళ్ళకి ఏమి రాగం వాయిస్తున్నారో స్పృహ లేకపోవచ్చును, కానీ వినడానికి మాత్రం చాలా బాగుంటుంది. అంటే ఆ విద్వాంసుడు ఆటోమాటిజాన్ని సాధించాడనిఅర్థం; ఇక మానసికంగా ప్రతీదీ ఎంపిక చేసుకోవలసిన అవసరం లేదని అర్థం. .

ఒకానొక స్థితిలో, ఆలోచనకు స్థానం లేనప్పుడు, ఆలోచించేవాడు కూడా అదృశ్యమైపోతాడు. మానసిక శాస్త్రం దీన్ని 'ఫ్లో స్టేట్' అని, లేక 'బీయింగ్ ఇన్ ద జోన్' అని అంటుంది. అంటే ఒక నైపుణ్యం కలిగిన వ్యక్తి తన రంగంలో ఎంత లీనమైన స్థితిలో ఉంటాడంటే, తన ఆస్తిత్వాన్నే కోల్పోయిన స్థితిలో ఉంటాడు; అవన్నీ ఎక్కడ పోయాయి? అన్నీ ఆతని పనిలో విలీనమైపోయాయి.

ఒక బాస్కెట్ బాల్ ఆటగాడున్నాడనుకోండి, అతను లెక్కలు వేసుకుంటూ కూర్చొనే సమయం ఉండదు; "ఇలా వేయాలా, అలా వేయాలా" అని ఆలోచించే లోపల అవకాశం చేయి జారిపోతుంది. వాళ్ళ కదలికలు వేగంగా ఉండాలి, అప్రయత్నంగా ఉండాలి. వాళ్ళు మరి ఈ ఆటోమాటిజం స్థితికి ఎలా చేరుకోవాలి? అలా తయారవడానికి వాళ్ళు పడే శ్రమను అందుకే మనం గుర్తించవలసి ఉంది. అప్రయత్న స్థితిని సాధించాలంటే చాలా ప్రయత్నం కావాలి. ఒక ఫ్లూటిస్టు ఎన్నో యేళ్ళు సాధనకు వెచ్చిస్తాడు. కళలోని ప్రతి చిన్న అంశంపైన పట్టు సంపాదించడానికి ఎంతో శ్రమించవలసి వస్తుంది. బాస్కెట్ బాల్ ఆటగాడు అన్ని రకాల కోణాల నుండి కొన్ని వేల సార్లు బాల్ వేయడం ప్రాక్టీసు చేస్తాడు; ఆ విధంగా తనకు అవసరమైనప్పుడు అప్రయతనంగా అవసరమైన ఆక్షన్ చేయగలుగుతాడు.

## చైతన్యం మీద పట్టు

ఆధ్యాత్మికతలో మన లక్ష్యం అంతా కుడా చైతన్యంపైన పట్టు సంపాదించడమే. చైతన్యాన్ని ఒక ఇంద్రధనస్సుగా భావిస్తే, అందులోని ఒక్కొక్క రంగు ఒక్కొక్క ఫ్రీక్వెన్సీకి చెందిన చైతన్యం అనుకోవచ్చు. ఆ క్షణానికి, మనం ఉన్న దశలో మనకు అవసరమైన చైతన్య స్థితిని అందుబాటులోకి వచ్చే విధంగా, మన ఆధ్యాత్మిక ప్రక్రియలను భౌతిక జీవనంలో కలిసిపోయేలా రూపొందించబడ్డాయి. బాబూజీ దీనికి అద్భుతమైన ఉదాహరణగా ఉండేవారు. ఒక క్షణం ఎక్కడో ఉంటే, మరో క్షణం కేంద్రంలో నిమగ్నమై ఉండేడిపోయేవారు. మరికొంత సేపటికి అభ్యాసీలతో ఉత్సాహంగా మాట్లాడుతూ ఉండేవారు. ఆయన పనికి అవసరమైన విధంగా ఆయన చైతన్యం ఎప్పటికప్పుడు తనకు తానుగానే సర్దుకుంటూ ఉండేది. తాను పని చేసిన కార్యాలయంలో తన కంటే ఉన్నత స్థితిలో ఉన్నవారితోనూ, తన కంటే చిన్న స్థాయిలో ఉన్నవారితోనూ ఏ విధంగా సర్దుకొనేవారో మనం ఊహించుకోగలం. ఇదంతా ఆయనలో అప్రయత్నంగానే జరుగుతూండేది. ఆయన సహజత్వం అలా ఉండేది.

ఒక ప్రత్యేకమైన చైతన్య ఫ్రీక్వెన్సీకి అప్రయత్నంగా కదలాలీ అంటే, మనం ఇంతకు పూర్వమే దానిపై పట్టు సంపాదించి ఉండాలి. చైతన్యం యొక్క ఫలానా ఫ్రీక్వెన్సీకి చేరుకొని, దాన్ని అధిగమిస్తే తప్ప, మనం అనుకున్నప్పుడు ఆ చైతన్య స్థితి మనకు అందుబాటులోకి రాదు. బాస్కెట్ బాలల్ ఆటగాడు, సరైన సమయంలో సరైన షాట్ ఇవ్వాలంటే, ఏ విధంగా అయితే ప్రతీ షాట్ ప్రాక్టీసు చేయవలసి ఉంటుందో, మనం కూడా మనకు అవసరమైన ఫ్రీక్వెన్సీ అందుబాటులోకి రావాలంటే, చైతన్యం యొక్క ప్రతీ స్థితిపైన పట్టు సంపాదించవలసి ఉంటుంది.

ఫలానా చైతన్య స్థితి అవసరమైనప్పుడు అందుబాటులోకి రావాలంటే, కేవలం కోరుకున్నందువల్ల, లేక ప్రార్థించడం వల్ల రాదు. మళ్ళీ మళ్ళీ మనం సాధన లేక అభ్యాసం అనే అన్నిటి కంటే ముఖ్యమైన అంశానికే వస్తాం. సాధన లేకుండా అప్రయత్నంగా జరుగవలసిన చర్యలు జరగవు. సైకిల్ తొక్కడమైనా, ఫుట్ బాలల్ ఆడటమయినా, వాయిద్యం వాయించాలన్నా అభ్యాసమే, ప్రాక్టీసే కీలకమైనది. అభ్యాసం అంటే ఏమిటి? అప్రయత్నంగా ఉండటం కోసం చేసే ప్రయత్నం చేయడమే.

## ప్రయత్నం, అప్రయత్నం, కర్తృత్వం

మనం చైతన్యంపై పట్టు సంపాదించే ప్రయత్నాలు మనలో "నేను చేస్తున్నాను" అనే కర్తృత్వ భావంవాన్ని కలిగించవచ్చు. ప్రయత్నం చేస్తున్నందు వల్ల ఫలితంగా కలిగేటువంటి భావమిది; ఇది అహం అంటే ఏమిటోసరిగ్గా తెలియజేస్తుంది కూడా. అహంకారం అనే పదాన్ని పరిశీలిస్తే కూడా ఇది అర్థమవుతుంది: 'అహం' అంటే 'నేను'. 'కారం' అనే పదం 'కృ' అనే ధాతువునుండి వస్తుంది, అంటే 'చేయడం' అని అర్థం. ఈ విధంగా చూసినట్లయితే అహంకారం అంటే 'నేను చేస్తున్నాను' అనే అర్థం వస్తుంది. ప్రయత్నంతో ధ్యానించడం వల్ల, దాని వల్ల కలిగే కర్తృత్వ భావం, ఈ రెండూ ఆఅహాన్ని బలోపేతం చేస్తాయి. ఫలితంగా ధ్యాన ప్రయోజనమే నెరవేరదు.

వాస్తవానికి, ఆటోమాటిజం అంటే ఈ కర్తృత్వ భావాన్ని లేక ఆఅహాన్ని మార్చడమే. అదెలా సాధ్యం? మనం చేసే ఫలానా పని మనం గాకుండగా మరెవరో చేస్తున్నారన్న, లేక మరేదో చేయిస్తున్నదన్న, ఎరుక కలిగి ఉన్నప్పుడు ఇది సాధ్యపడుతుంది. (కర్తృత్వ భావం అనేది కేవలం మన మనోభావమేనని లేక మన మనోవైఖరేనని దయచేసి గమనించండి. దాన్ని విడిచిపెట్టడం అంటే ఏమీ పని చేయకుండా ఉంటామని కాదు.)

మహర్షులు తరచూ సాక్షి భావాన్ని ప్రశంసిస్తూ ఉంటారు; సాక్షి భావంలో మనం ఎటువంటి కర్మలకూ కర్తలం కాము, సాక్షులం అంతే. శ్రీకృష్ణ భగవానుడు, అష్టావక్రుడు, ఉపనిషత్తులు ఈ సాక్షిభావాన్ని బాగా కీర్తిస్తాయి, చాలా చోట్ల కీర్తించడం జరిగింది; విపులంగా వివరించడం కూడా జరిగింది. కానీ మనలో చాలా మందికి ఈ సాక్షి భావాన్ని పొందడం అంత తేలికైన విషయం కాదు. సాక్షి అనేవాడు అంటనివిధంగా, చలించకుండా, చుట్టూ జరిగే అనుభవాలతో గాని, సంఘటనలతో గాని సంబంధం లేకుండా ఉండాలి. మన స్వంత కుటుంబంతో ఏ సంబంధమూ

లేనట్లుగా ఉండలేము కదా? అందుకే బాబూజీ ఈ కర్తృత్వ భావంలో ఉండే లోటుపాట్లను అధిగమించే విధంగా మనకు విషయాలను సరళీకరించి, ఒక తేలికైన మార్గాన్ని సూచించడం జరిగింది. ఈ మార్గంలో మనకు కర్తృత్వం ఉంటుంది, కానీ మనం చేసే కర్మలు వారికి అర్పిస్తూ జీవిస్తాం. ఆ విధంగా జీవించడంతో మనం చేసే అన్ని పనుల్లోనూ కూడా ఒక నిస్వార్థ భావాన్ని ప్రవేశపెట్టారు బాబూజీ. ఈ నూతన మనోవైఖరితో మనం సురక్షితంగా మన ఆధ్యాత్మిక జీవితంలో అహంకార విస్ఫోటనలేవీ జరుగకుండా మన ప్రయత్నాలు మనం కొనసాగించుకోవచ్చు. ఇదే భక్తి మార్గం. దీన్నే మనం నిరంతర స్మరణ సాధన అని కూడా అంటాం.

## వివిధ చైతన్య ఫ్రీక్వెన్సీలతో పని చేయడం

ఒక ప్రత్యేకమైన చైతన్య ఫ్రీక్వెన్సీపై పట్టు సంపాదించి, దాన్ని మనలో సమ్మిళితం చేసుకొనేటప్పుడు, మనం చేయవలసిన ప్రయత్నాలేమిటి? సాధారణంగా మనం ఎ. ఇ. ఐ. ఓ. యూ. (ఎ – ఆధ్యాత్మిక స్థితిని సంపాదించడం/గుర్తించడం; ఇ – దానిపై దృష్టిని సారించడం ద్వారా జీవం పోయడం; ఐ – ఆ స్థితిని ఆస్వాదించడం; ఓ – ఆ స్థితిని లోపలికి గ్రహించడం; యు – ఆ స్థితిలో లయమైపోవడం) పద్ధతిని అనుసరిస్తాం. ఈ నూతన ఆధ్యాత్మిక స్థితిని మన ఉపచేతనంలోకి మిళితం/విలీనం చేసుకొనే కీలకమైన పద్ధతి ఈ ఎ. ఇ. ఐ. ఓ . యు. పద్ధతి. తద్వారా ఆటోమాటిజం సంభవించే వీలును కల్పించడం జరుగుతుంది. అలాగే మనం చేసే మరో ప్రధాన ప్రయత్నం – ప్రతి నిత్యం శుద్ధీకరణ ప్రక్రియను చేసుకోవడం. ఎందుకంటే చైతన్య శుద్ధి జరగకుండా మనం చేసే ప్రయత్నాలు మన జీవితాన్ని మరింత జటిలంగా తయారు చేసే అవకాశం ఉంటుంది. చైతన్య శుద్ధి లేకపోయినట్లయితే చైతన్యంలో ఇన్ని రకాల ఫ్రీక్వెన్సీలున్నాయని, ఇటువంటి సూక్ష్మాలున్నాయని కూడా తెలియదు. .

మనం ఏ కొత్త స్థితితో పని చేసినా అది సంపూర్ణంగా ఉండాలి. అది చురుకుగా ఉండాలి అంటే దాని ప్రభావం అన్నీ స్థాయిల్లోనూ ఉండాలి, శారీరక స్థాయిలో కూడా. మన బాహ్య స్థితిని అంతరంగ స్థితికి అనుగుణంగా సర్దుకున్నప్పుడు, ఆ స్థితి మరింత ఉన్నతంగా మారవచ్చు. ఉదాహరణకు, మీ శ్వాస గమనాన్ని గనుక తగ్గించి అంతరంగ స్థితికి తగినట్లుగా ఉంటే మీ అంతరంగ స్థితి మరింత తీక్ష్ణమవుతుంది. దీనికి విరుద్ధంగా శ్వాస గతి తీవ్రమైనట్లయితే ఉగ్రమైన ఉద్వేగం సృష్టించవచ్చు. అది మన అంతరంగ స్థితిని పాడుచేయవచ్చు.

బాహ్య స్థితిని శృతి చేసుకోవడం ద్వారా అంతరంగ స్థితిని శృతి చేసుకొనే సూత్రం బాబూజీకి సుపరిచితంగానే ఉండేది. ఉదాహరణకు, ప్రేమ, తపన సృష్టించడానికి ఆయన పద్ధతికి ఆధారం ఇదే. మనం ప్రేమించే వ్యక్తిని స్మరిస్తామని బాబూజీ గుర్తించారు; ఈ పద్ధతిని తిరగేస్తే మనం ప్రేమించాలన్న వ్యక్తి పట్ల ప్రేమ కలగాలంటే ఆ వ్యక్తిని స్మరించమనేవారు. 1982 లో సూరత్ లో ఇచ్చిన సందేశంలో, ఎవరిలోనైనా తపన లేకపోయినట్లయితే, తపన అనేటువంటి స్థితిని కృత్రిమంగా అనుకరించమన్నారు. అది కృత్రిమం అయినప్పటికీ ఒకరోజు అది నిజమైపోతుందన్నారు.

అంతరంగాన్ని శృతి చేసుకోటానికి బాహ్యాన్ని శృతి చేసుకోవడం అనేది, జీవితంలోని అనేక అంశాలలో అన్వయించుకోవచ్చు. మీరు సంభాషించే విధానంలో కావచ్చు, బాహ్య వస్తువుల పట్ల మీ మనోవైఖరిలో కావచ్చు, మీ ఆలోచనలు కావచ్చు, మీ ప్రవర్తన కావచ్చు, మీ చేతలు  కావచ్చు, మీరు ఆహారం తీసుకునే తీరు కావచ్చు, మీరు నిద్రపోయే విధానం కావచ్చు, మీ శ్వాస తీరు కావచ్చు, మీ చూపులు కావచ్చు, ఇవన్నీ మీ అంతరంగ స్థితిని ప్రభావితం చేస్తాయి, అలాగే ఆ స్థితిని మరింత మెరుగుపడటానికి కూడా దోహదం చేస్తాయి.

ప్రతీ నూతన స్థితీ మీ ఉనికిలోకి సమ్మిళితం చేసుకున్నప్పుడు మీ ప్రయత్నాలు సూక్ష్మంగా తయారవుతాయి. కాలక్రమేణా, మీ జీవితం కోసం ఆ స్థితిని మీరు  పట్టుకు వ్రేలాడే బదులుగా, మీకు యేదో శక్తి వెనుక ఆసరాగా ఉందని, మీ చేతలన్నీ కూడా ఎవరో సూచిస్తున్నట్లుగానూ, మీరు కనుగొనడం జరుగుతుంది. యేదో ఉన్నత శక్తి, కర్త అని, మీరు కాదని అనిపిస్తుంది. ఇది సహజంగా జరిగినప్పుడు, ఆ ఉన్నత శక్తిని గుర్తించేందుకు బాబూజీ సూచించిన పద్ధతిని అవలంబించి, ఆ శక్తి మీ మాస్టారేనని, 'ఆయనే కర్త' యని భావించవచ్చు. ఇటువంటి మనోవైఖరి ద్వారా మీరు మీ కర్తృత్వ భావాన్ని, మీ ఆహాన్ని మీ మాస్టరుకు అర్పిస్తున్నారు. ఆ విధంగా మీరు మీ కళ్ళ ముందు విచ్చుకుంటున్న ఉన్నత కార్యానికి కేవలం సాక్షిగా ఉండగలుగుతారు. గతంలో పెద్దలు వివరించిన సాక్షి భావం ఇదే. "నేను కర్తను" అనే భావానికి చాలా దూరమైపోయాం ఇప్పుడు.  అయినప్పటికీ ఆటోమాటిజాన్ని మనం ఇంకా పూర్తిగా అందుకోలేదు.

## ఆటోమాటిజం యొక్క అతిసూక్ష్మ అభివ్యక్తీకరణ – తురీయాతీత స్థితి

చివరికి సాక్షిభావానికి సంబంధించిన గుర్తింపు కూడా అదృశ్యమైపోతుంది, ఇక కర్త అంటూ కూడా ఎవరూ ఉండరు – మాస్టరుతో సహా. ఏమీ లేకపోయినప్పటికీ చర్యలు అప్రయత్నంగా కొనసాగిపోతూ ఉంటాయి. ఈ స్థితినే తూరీయాతీత స్థితి అని అంటారు. ఏ  అవరోధాలూ లేకుండా పని తనంతతానుగా ప్రవహిస్తూ పోతూ ఉంటుంది, మీరు మాత్రం మునిగిపోయిన స్థితిలో కొనసాగుతూ ఉంటారు. మీ యాత్రలో ముందుకు సాగుతున్న కొద్దీ, ఉన్నత ఫ్రీక్వెన్సీలలో ప్రతీసారీ మళ్ళీ మళ్ళీ ఈ స్థితి తటస్థమవుతూ ఉంటుంది.

కొంతమంది కప్పులో మునిగిపోతారు,
కొంతమంది బకెట్లో మునిగిపోతారు,
కొంతమంది తొట్టిలో మునిగిపోతారు,
కొంతమంది కొలనులో మునిగిపోతారు,
కొంతమంది నదిలో మునిగిపోతారు,
కొంతమంది సముద్రంలో మునిగిపోతారు,
కొంతమంది మహాసముద్రంలో మునిగిపోతారు.

ప్రేమతోనూ, గౌరవంతోనూ ,
కమలేశ్

పూజ్య బాబూజీ మహారాజ్ 122 జయతిఉత్సవాల సందర్భంగా
30 ఏప్రిల్ 2021